పంటలకు అపారనష్టం

- ప్రాథమిక అంచనాలు తయారు చేసిన అధికారులు
- పంటల నష్టం అంచనాకు ఆదేశాలివ్వని ప్రభుత్వం
- నష్టపరిహారం అందించాలని కోరుతున్న రైతులు


మూలపాడులో ఏనుగుగడ్డ వాగు నీటి ఉధృతితో చేలో మేటవేసిన మట్టి

ఇబ్రహీంపట్నం: ఎగువ ప్రాంతాల్లో కురిసిన అధిక వర్షాలతో కృష్ణానదికి పోటెత్తిన వరద ప్రవాహం వ్యవసాయ పంటలను ముంచెత్తింది. ఏనుగుగడ్డ వాగు, కొండవాగులు పొంగి పొర్లడంతో మండలంలోని పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వరద ప్రవాహం తగ్గుముఖం పట్టినప్పటికీ అనేక గ్రామాల్లోని పంటలు నీటిలోనే ఉన్నాయి. మండలంలో వరి, పత్తి, మునగ, మినుము, చెరుకు, అరటి, ఇతర కూరగాయ పంటలు సుమారు 5,000 ఎకరాల్లో ఇప్పటికే సాగు చేపట్టగా వరద ప్రభావంతో సుమారు వెయ్యి ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి.

వెయ్యి ఎకరాల్లో పంటలకు నష్టం

కుండపోత వర్షాలతో మున్నేరు పొంగింది. దానికి అనుసంధానంగా ఉన్న ఏనుగుగడ్డ వాగు ఉగ్ర రూపం దాల్చింది. వాగు ప్రభావంతో చిలుకూరు, కొటికలపూడి, జూపూడి, మూలపాడు, చినలంక గ్రామాల్లోని వెయ్యి ఎకరాలకు పైగా పంటపొలాల పైకి వరద నీరు చేరింది. వరద ప్రవాహంతో వరి, మినుము, పత్తి, బెండ, దోస, సొర వంటి కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. కొటికలపూడి, చినలంక గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో మినుము పైరు పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది. పత్తి పొలాల్లో నీరు చేరడంతో మొక్క ఎదుగుదల లోపించి తెగుళ్లు ఆశిస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లేతోట రైతులు మరలా విత్తనం విత్తే ఆలోచనలో ఉన్నారు. కుండపోత వర్షాలతో జూపూడి వద్ద ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు, కొండ వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఇబ్రహీంపట్నం, జూపూడి, కిలేశపురం గ్రామాల్లోని వరి పైర్లు ముంపునకు గురయ్యాయి. మూడు రోజులుగా నీటిలోనే పైరు ఉండటంతో మొక్క బతికే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. కొన్ని పొలాల్లో మరలా వరినాట్లు వేసుకోవాల్సిందే అనే నిర్ణయానికి రైతులు వచ్చారు.


కొటికలపూడిలో వరదకు దెబ్బతిన్న బెండ చేను


చిలుకూరులో ముంపునకు గురైన పత్తి చేను

నష్టం అంచనాకు ఆదేశాలు ఇవ్వని ప్రభుత్వం

మండల పరిధి గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక అంచనాలు తయారు చేసి నివేదికలను ఉన్నతాధికారులకు ఇప్పటికే పంపారు. అయితే పూర్తి స్థాయిలో నీటి ముంపుతో నష్టపోయిన పంటల అంచనా తయారు చేసేందుకు ప్రభుత్వ అధికారుల నుంచి ఇప్పటి వరకు ఆదేశాలు రాలేదని తెలిసింది. ఈ పరిణామాలతో నీటి ప్రవాహానికి గురైన పంటలపై ప్రభుత్వం స్పందిస్తుందా లేదా అనే సందేహం రైతుల్లో నెలకొంది. ప్రభుత్వం స్పందించకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు. తక్షణమే జిల్లా వ్యవసాయ శాఖాధికారులు స్పందించి పంటల నష్టం నమోదుపై ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఐదు ఎకరాల్లో వరిపైరు దెబ్బతింది



జూపూడిలో ఈ ఏడాది ఐదు ఎకరాల్లో వరిసాగు చేశా. వరదతో పంట నీటిలో మునిగి పోయింది. మూడు రోజులుగా చేనంతా నీటితో నిండి ఉంది. ఇప్పటికే ఎకరాకు రూ. 12 వేల చొప్పున సుమారు రూ.60 వేలకు పైగా ఖర్చు చేశా. నీరు తగ్గినా మొక్క బతికిద్దో లేదో అనుమానంగా ఉంది. నష్ట పరిహారం చెల్లించాలి.

– ఎస్.ఏడుకొండలు, రైతు, జూపూడి

నష్టం అంచనాలు వేయాలి



ఇబ్రహీంపట్నం మండలంలో వాగులు, వంకలు, కృష్ణా నదికి వచ్చిన వరదల ప్రభావం వలన పంట పొలాలు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధికారుల ప్రాథమిక అంచనా లెక్క సుమారు వెయ్యి ఎకరాలుగా ఉంది. లెక్కకు మించి పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పంటల నష్టం అంచనాకు ఆదేశాలిచ్చి నమోదు చేయించాలి.

– మల్నీడి యలమందారావు, రైతు సంఘం నాయకుడు

గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

మాజీ మంత్రి జోగి రమేష్

మైలవరం: స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న చిరస్మరణీయుడని, దేశానికి ప్రత్యేకించి ఆంధ్ర రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ అన్నారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా మైలవరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహం వద్ద గౌతు లచ్చన్న విగ్రహానికి శనివారం జోగి రమేష్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోగి రమేష్ మాట్లాడుతూ ఎమ్మెల్సీగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా ఆయన సేవలు ఎనలేనివన్నారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం పదవులను కూడా త్యజించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అనంతరం అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు పామర్తి శ్రీనివాసరావు, రాష్ట్ర సెక్రటరీ వేములకొండ తిరుపతిరావు, మైలవరం మండల పార్టీ కన్వీనర్ గర్నేపూడి వెంకట్రావు, సీనియర్ నాయకులు ఎన్‌డీపీ బ్రదర్స్, ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

● మైలవరం: అఖిల భారత గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. గౌతు లచ్చన విగ్రహానికి ఏఎంసీ చైర్మన్ నవ్యశ్రీ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పాలు, పంచారు.

మైలవరం: చిరస్మరణీయుడు గౌతు లచ్చన్న అని, స్వాతంత్ర్య సముపార్జనకు ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహం వద్ద గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం అన్నదాన చేశారు. ఢ్లు పంపిణీ చేశారు.

● చాట్రాయి: సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పర్వతాపురంలో శనివారం నిర్వహించారు. గౌతు లచ్చన్న సేవలను గౌడ సంఘం నాయకులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మిద్దె శివాజీ, గౌడ సంఘం నాయకులు చింతగుంట్ల వెంకటేశ్వరావు, బూబత్తుల చెన్నారావు, తల్లాడ శ్రీనివాసరావు, పలగాని రఘు తదితరులు పాల్గొన్నారు.


మైలవరంలో నివాళులర్పిస్తున్న జోగి రమేష్, పామర్తి శ్రీనివాసరావు తదితరులు


నూజివీడులో నివాళులర్పించి మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి


పర్వతాపురంలో గౌతు లచ్చన్న చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

● నూజివీడు: బడుగు, బలహీన వర్గాలు, రైతుల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా నూజివీడులోని బస్టాండ్ సెంటర్‌లోని గౌతు లచ్చన్న విగ్రహానికి శనివారం మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఎన్నోసార్లు జైలు జీవితం గడిపారన్నారు.

కష్టపడితేనే ఉత్తమ భవిత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కష్టపడి చదివితేనే ఉత్తమ భవితను సొంతం చేసుకుంటారని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ జోనల్ హెడ్ సీతారామారావు అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ ఆంథోని బాలికల పాఠశాల (ఆర్‌సీఎం స్కూల్)లో విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ సోనీ ప్రశాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శాస్త్ర, సాంకేతిక అంశాలపై అవగాహనే జేవీవీ లక్ష్యం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మూఢ నమ్మకాలు పారదోలడంతో పాటు శాస్త్ర, సాంకేతిక అంశాలపై ప్రజలకు అవగాహన పెంచడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని ప్రముఖ వైద్యులు మామిడి సీతారామారావు అన్నారు. జన విజ్ఞాన వేదిక మహాసభ కొండపల్లిలో శనివారం జరిగింది. ఇటీవల మృతి చెందిన పట్టణ జేవీవీ గౌరవ అధ్యక్షుడు మహబాషకు సంతాపం తెలిపారు. ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్షించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, మాజీ సర్పంచి వెనిగళ్ల అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. యోగా గురువు లంకే జనార్దన్ సూక్ష్మ వ్యాయామాలు, యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం, ముద్రలపై యోగా సాధకులకు అవగాహన కల్పించి వారితో సాధన చేయించారు. యోగాతో జీవితం సాఫీగా సాగుతున్నట్లు పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఎన్టీటీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

వేతనాల కోసం కార్మికులు ఉద్యమించాలి

ఇబ్రహీంపట్నం: ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు వేతనాల కోసం ఉద్యమాలు చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇబ్రహీంపట్నంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికుల సమావేశం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ రూరల్ వాటర్ సప్లైలో పనిచేస్తున్న కార్మికులను పంచాయతీ రాజ్ శాఖలో వేతనలు తీసుకోమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వేతనాల కోసం కార్మికులు ఉద్యమ బాట పట్టాల్సి వస్తోందని చెప్పారు. త్వరలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా కాంట్రాక్ట్ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల పంపిణీ



విస్సన్నపేట: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం పేదలకు కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జగ్గవరపు రంగారెడ్డి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు మధుమేహ రోగులకు వైద్యశిబిరం

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరువూరులో మధుమేహ రోగుల ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశామని జేవీవీ ప్రతినిధులు పాపారావు, హరికృష్ణ తెలిపారు. స్థానిక ఫ్యాక్టరీ సెంటర్‌లోని నాగార్జున స్కూల్‌లో ఉదయం ఐదు నుంచి 11 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందని చెప్పారు. మధుమేహం, రక్తపోటు, మూర్ఛరోగులను వైద్యులు పరీక్షించి అవసరమైన మందులు అందజేస్తారని చెప్పారు.

వాజ్‌పేయికి నివాళి

ఇబ్రహీంపట్నం: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమం ఇబ్రహీంపట్నంలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకుడు రేగళ్ల రఘునాథరెడ్డి, కొండపల్లి పట్టణ అధ్యక్షురాలు టి.మాధురి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. నాయకులు యుగంధర్, భవానీ, సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: దాతల ఆర్థిక సాయంతో నలుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. మండలంలోని తోటపల్లి హీల్ సంస్థలో శనివారం దాతలు బోడేపూడి శివ కోటేశ్వరరావు, బ్రహ్మయ్య అందజేసిన ఆర్థిక సహాయంతో నలుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు.

ఏరియా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలి

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు డిమాండ్

నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 300 బెడ్లు అందుబాటులోకి తీసుకువచ్చామని.. ఈ నేపథ్యంలో ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.22 కోట్లతో ఆధునిక భవనాన్ని అన్ని వసతులతో నిర్మించామన్నారు. గత ప్రభుత్వంలోనే నాబార్డు నుంచి మరో రూ.4 కోట్లు మంజూరు చేయించి భవనం పై భాగంలో స్పెషల్ రూంలు, ఇతర నిర్మాణాలకు గత ప్రభుత్వంలోనే శంకుస్థాపన చేశారన్నారు. ఎట్టకేలకు కాంట్రాక్టర్ ఇటీవలనే పనులు ప్రారంభించాడని చెప్పారు. పాత బిల్డింగ్‌లో 100 బెడ్‌లు ఉండగా, నూతన భవనంలో 220 బెడ్లు ఏర్పాటు చేశారని చెప్పారు. ఏలూరులోని జిల్లా ఆస్పత్రిని మెడికల్ కాలేజీగా మార్చిన నేపథ్యంలో అన్ని వసతులు ఉన్న నూజివీడు ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే ఈ ప్రాంత ప్రజలతో పాటు జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుతాయని వివరించారు. ఎమ్మార్ అప్పారావు కాలనీలోని ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి కోరతామన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు!

చాట్రాయి: మండలంలోని చాట్రాయి–విస్సన్నపేట మండలం నర్సాపురం గ్రామాల మధ్య కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఈ మార్గం నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. ఇదే మార్గంలో చాలా చోట్ల రోడ్డు కోతకు గురై పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. పొరపాటున వాహనం రోడ్డు మార్జిన్ దిగితే అంతే సంగతులు. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పుకోవాలంటే మార్జిన్ దిగాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు కోతకు గురైన రోడ్ల మార్జిన్లకు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.


చాట్రాయి-నర్సాపురం మధ్య కోతకు గురైన రోడ్డు

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న ముద్దరబోయిన, ట్రస్టు నిర్వాహకులు

నూజివీడు: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు శ్రీగోకుల కృష్ణ యాదవ సేవా ట్రస్టు ప్రోత్సాహక బహుమతులు అందించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో నూజివీడు నియోజకవర్గ స్థాయిలో 550కి పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ట్రస్టు తరఫున శనివారం ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాలను, నగదు బహుమతిని అందజేసి సత్కరించారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిబోయిన శ్రీనివాస్, ట్రస్ట్ ఫౌండర్, ట్రెజరర్ ఆర్ల గోపాలకృష్ణ, ప్రెసిడెంట్ చిర్ర కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మానికల గంగాధర్, కార్యనిర్వాహక కార్యదర్శి చింతా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాల్లో మంచినీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు డిమండ్ చేశారు. మల్లికార్జునపేట కొండ ప్రాంతంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానిక వాటర్ ట్యాంక్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ మల్లికార్జునపేటలోని బాల రమణయ్య, ఆకుల వారి వీధి ప్రాంతాల్లో గత వారం రోజులుగా మంచినీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమస్యపై ప్రజలు పలుమార్లు అధికారులకు తెలియపరిచిన ఎవరూ పట్టించుకోవడంలేదని తెలిపారు. అందువలనే ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. ప్రజలపై పన్నుల భారాలు పెంచడంలో చూపిన శ్రద్ధ మంచినీరు అందించడంలో చూపించాలని కోరారు. కృష్ణానది పక్కన ఉన్నా ప్రజలకు మంచినీరు అందించడంలో పాలకులు వైఫల్యం చెందారని ధ్వజమెత్తారు. పైప్ లైన్లు లీకేజీలు నివారించేందుకు తగినంత సిబ్బంది ఏర్పాటు చేసుకోకుండా గాలికి వదిలేస్తున్నారన్నారు. నాణ్యమైన మంచినీరు ప్రజలకు అందించాలని కోరారు. నాయకులు స్థానిక శ్రీనివాస్, కె.జ్యోతి, జి.భవానీ, జి.ఝాన్సీ, టి.వెంకటలక్ష్మీ సీఐటీయూ నేత వి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న కొండ ప్రాంత వాసులు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు


విశేష అలంకారంలో నెమలి వేణుగోపాలస్వామి


కొండపల్లి వేడుకల్లో ఎన్టీటీపీఎస్ సీఈ శివరామాంజనేయులు, రామకృష్ణ తదితరులు


ఆగిరిపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు

ఇబ్రహీంపట్నం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పలు ప్రాంతాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. చలువ పందిళ్లల్లో శ్రీకృష్ణుని విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. కొండపల్లి బీకాలనీలో శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ శివరామాంజనేయులు, టీటీడీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసబాబా ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సాహంగా ఉట్టికొట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సేవా సమితి సభ్యులు, బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పసాని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. యాదవుల వీధి, కేరళ హోటల్ వద్ద మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, రాధ దంపతులు పూజలు జరిపారు. కిలేశపురంలో ఉత్సాహంగా వేడుకలు జరిపి ఉట్టికొట్టారు.

● మైలవరం: మైలవరంలోని పాండురంగస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివార్లను నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

● తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. స్వామివారిని నవనీత కృష్ణుడిగా విశేష అలంకరణ చేసి తొమ్మిది రకాల ప్రసాదాలు నివేదించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సంధ్య పర్యవేక్షించారు.


లోపూడిలో ఊరేగింపు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

● విస్సన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ద్వారకానగర్‌లోని శ్రీ కృష్ణ దేవాలయంలో, జానలగడ్డలోని రుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో, నూజివీడు రోడ్డులో ఏర్పాటు చేసిన కృష్ణుడి పందిళ్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు చిన్ని కృష్ణుడి వేషధారణలతో సందడి చేశారు. అనంతరం ఉట్టి కొట్టారు.

● ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని వరాహ పుష్కరిణి వద్ద వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఏడు వేల మందికి అన్నదానం చేశారు. శ్రీకృష్ణ యువసేన ఆధ్వర్యంలో కోలాటం, ఉట్టి కొట్టే కార్యక్రమం, స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

● చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. యువకులు రంగులు చల్లుకుంటూ ఉట్టి కొట్టారు. కోటపాడు గ్రామంలోని రామాలయంలో శ్రీ కృష్ణుడికి భక్తులు పూజలు చేశారు.

● ముసునూరు: లోపూడిలోని ప్రసిద్ధ వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు ముసునూరు, వేల్పుచర్ల, గోపవరం, కాట్రేనిపాడు, గోగులంపాడు, రమణక్కపేట, చెక్కపల్లి, బాసవరప్పాడు, గుడిపాడు తదితర గ్రామాల్లో రామాలయాల వద్ద శనివారం ఉత్సవాలు నిర్వహించారు. యువత ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. లోపూడిలోని వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు నిర్వహించారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం విజయకుమారి, సర్పంచి శ్రీలక్ష్మి, గ్రామ పెద్దలు

నూజివీడు: మండలంలోని అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్‌నకు ఎంపికయ్యారని హెచ్ఎం జి. విజయకుమారి తెలిపారు. మరిపి కల్యాణి, ప్రత్తిపాటి సూర్య ఎంపికయ్యారని, దీంతో వీరికి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేస్తుందన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ


హైస్కూల్‌కు మైక్‌సెట్, బీరువాను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ముసునూరు: పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. ముసునూరు హైస్కూల్ ప్లస్‌లో 1999–2000 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.32,000లతో లౌడ్ స్పీకర్ మైక్ సెట్, ఐరన్ బీరువాను అందజేశారు. పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో మైక్‌సెట్, బీరువాను హెచ్ఎం శైలజకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సత్య వరప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరేడు రైతుల పోరాటానికి మద్దతు

నూజివీడు: బలవంత భూసేకరణ జరుపవద్దని కరేడు రైతులు చేస్తున్న ఆందోళనకు పూర్తి మద్దతు ఇస్తుందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు రైతుల భూములను రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ప్రాజెక్టు కోసం బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న నిరసనకారులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కరేడు రైతుల పోరాటానికి సంఘీభావంగా ఆగస్టు 18న కరేడు వెళుతున్నామని చెప్పారు.